


TS-20-0147370

# మన మాట

TELANAGANA సంపుటి 7 సంచిక 215

ప్రతి పదం ప్రజల పక్షం

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

శుక్రవారం | 20 ఫిబ్రవరి | 2026 | పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# సమాజంలో చదవు ఉంటేనే విలువ






## విలువలతో కూడిన చదువులు నేర్పండి

## క్రమశిక్షణకు మారు పేరుగా దూసుకుపోండి

## రేపటి తరానికి నేటి నాయకుడు కొలాను శ్రీనివాసరెడ్డి పిలుపు

ప్రపంచంలో మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలోనూ మార్పులు రావాలి. అయితే ఆ మార్పులు కూడా మన మూలాలను మర్చిపోకూడదంటారు కాంగ్రెస్ నేత కొలాను శ్రీనివాసరెడ్డి.' ఎంత చదివామన్నది కాదు ముఖ్యం ఎంత సంస్కారంతో ఉన్నామన్నదే పాయింట్' అంటారాయన. వర్తమానానికి-భవిష్యత్తుకూ మధ్య వారధిగా నిలిచేది నేటి చిన్నారులే. అటువంటి చిన్నారులను తల్లి దండ్రులు బాధ్యతగా పెంచాలని ఆయన సూచిస్తున్నారు. ప్రతీ ఒక్కరూ తమ పిల్లలు ఇంజనీర్లో..డాక్టర్లో అయిపోవాలని కోరుకుంటారు. లేదా ఐఏఎస్..ఐపీఎస్ లు అయితే బాగుంటుందని కలలు కంటారు. ఆ కలలు కనడం తప్పు కాదు..కానీ ఆ క్రమంలో పిల్లలకు ఆ చదువుపై ఆసక్తి ఉందనేది తల్లిదండ్రులు తెలుసుకుని దానికి అనుగుణంగా వారిని చదివించాలని ఆయన అంటున్నారు. అంతే కానీ పిల్లలకు ఇష్టం లేని చదువులను బలవంతంగా రుద్దితే అది పిల్లల భవిష్యత్తునే నాశనం చేస్తుందని కొలాను శ్రీనివాసరెడ్డి అంటున్నారు. పిల్లలకు ఏ సబ్జెక్ట్ పై ఆసక్తి ఉందో..వారు ఏం చదివితే రాణిస్తారో వారికి విద్యాబుద్ధులు నేర్పించే గురువులకే బాగా తెలుస్తుంది కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాయిష్టాలను తెలుసుకోడానికి వారి గురువులను తరచుగా కలుస్తూ ఉండాలని ఆయన అంటున్నారు. నచ్చిన చదువును చదివిస్తేనే సార్ధకత ఉంటుందని ఆయన అంటున్నారు. ఆ చదువు కూడా విలువలతో కూడి ఉండాలంటారాయన.



### గురువే అన్నిటికీ మూలం ఆయనకే అగ్రతాంబూలం

### ప్రయోజకులుగా తీర్చిదిద్దే గురువులను అవమానించడం నేరం

తల్లి దండ్రులు పిల్లల్ని కంటారు. వారి భవిష్యత్తుపై కలలు కంటారు. అయితే ఆ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు వచ్చేలా తీర్చిదిద్దేది మాత్రం గురువులే అన్న సంగతిని ఎవ్వరూ మర్చిపోరాదని కొలాను శ్రీనివాసరెడ్డి అంటున్నారు. మన పూర్వీకులు గురుకులాల్లో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. తల్లి దండ్రులు కేవలం జన్మను మాత్రమే ఇస్తారు..వారి జన్మకు సార్ధకత చేకూర్చేది విద్యనేర్పే గురువులేనని శ్రీనివాస రెడ్డి అంటున్నారు. అటువంటి గురువును అవమానించడమనే ఓ దుర్మార్గ ధోరణి అక్కడక్కడా ప్రబలడం ఆందోళన కలిగిస్తోందని ఆయన అంటున్నారు. కొన్ని సినిమాల్లో కూడా గురువులను కమెడియన్లుగా చిత్రీకరిస్తోంటే సెన్సార్ బోర్డు ఏం చేస్తోందో అర్ధం కావడం లేదన్నారు. తల్లి దండ్రులు కూడా పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని ఆయన సూచిస్తున్నారు. తల్లి..తండ్రి తర్వాత గురువే దైవం అన్న వాస్తవాన్ని పిల్లలకు బాల్యం నుంచే అర్ధమయ్యేలా చెప్పాలని వారి పసి హృదయాల్లోనే గురువులపై భక్తిభావం పెంపొందించేలా తల్లి దండ్రులే శ్రద్ధ తీసుకోవాలంటారు శ్రీనివాసరెడ్డి.బడిలో గురువులు పిల్లల్ని దండించారంటే దానర్ధం ఆ పిల్లలకు చదువు బాగా రావాలన్న తపనే తప్ప వారిపై ఎలాంటి కక్షలూ ఉండవన్న ఇంగితాన్ని తల్లి దండ్రులు అర్ధం చేసుకుని అదే విషయాన్ని పిల్లలకు నూరిపోయాలని కొలాను శ్రీనివాసరెడ్డి



# పిల్లల్ని రోబోలను చేయకండి..
# లేత హృదయాలపై ఒత్తిళ్లు పెంచకండి

## తోటి పిల్లలతో పోల్చి పిల్లలను అవమానించకండ





కార్పొరేట్ విద్యా సంస్కృతిలో ఓ దుర్లక్షణం బాగా పెరిగిపోతోంది. పిల్లల్ని యంత్రాలుగా చేసేస్తున్నారు. పుస్తకంలో ఉన్న పాఠాన్ని యథాతథంగా బట్టీ పట్టించేస్తున్నారు. అయితే చదువనేది యాంత్రికంగా సాగకూడదంటారు కొలాను శ్రీనివాసరెడ్డి. పిల్లలపై అనవసరమైన మానసిక ఒత్తిడి పెంచేయడం నేరమంటారాయన. చదువనేది చక్కటి సెలయేరులా సజీవంగా ప్రశాంతం గా సాగిపోవాలే తప్ప పిల్లలను యాతన పెట్టే శిక్షలా ఉండకూడదంటారు. ఇటువంటి విద్యావిధానాన్ని ప్రభుత్వ. ప్రైవేటు విద్యాసంస్థలు అంది పుచ్చుకోవాలని..ప్రభుత్వాలు కూడా వీటికి అనుగుణంగా విధానాలు రూపొందించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లలను తోటి పిల్లలతో సరిపోల్చి అవతలి వారికి ఎక్కువ మార్కులు వచ్చాయి..నీకు రాలేదు అని కించ పర్చడం చాలా ప్రమాదకరమైన పరిణామమంటారు శ్రీనివాసరెడ్డి. చాలా మందికి అద్భుతమైన ర్యాంకులు వస్తున్నాయి కానీ..విషయ పరిజ్ఞానం ఉండడం లేదని ఆయన అంటున్నారు. గణితంలో వందకి వంద మార్కులు తెచ్చుకుంటోన్న పిల్లలు ఏడో ఎక్కం కూడా రావడం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో చదివే పాఠాలే చదువు కాదని ఆయన అంటున్నారు. నైతిక విలువలపై అవగాహన ..మంచి నడవడిక..చక్కటి సంస్కారం అలవర్చుకునేలా పిల్లల్ని



పెంచాలంటున్నారాయన. పాత రోజుల్లో ఉమ్మడి కుటుంబాల్లో అవ్వా..తాతలు సాయం వేళల్లో పిల్లలకు చక్కటి నీతి కథలు చెప్పేవారని..దాని వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరగడంతో పాటు నైతిక విలువలంటే ఏంటో తెలుస్తుందని శ్రీనివాసరెడ్డి అంటున్నారు.

### చదువొక్కటే కాదు.. ఆట పాటలూ ఉండాలి

పిల్లల్ని పొద్దస్తమానూ చదువు చదువు అని ఊరికే పీడించేయడం ఘోరమంటారు శ్రీనివాసరెడ్డి. 24 గంటలూ చదవడం వల్ల ఒనగూడే ప్రయోజనం శూన్యమే అని ఆయనంటున్నారు. చదువు ఎంత ముఖ్యమో మానసిక వికాసానికి పనికొచ్చే అంశాలూ అంతే ముఖ్యమంటున్నారు. రోజూ సాయం సమయాల్లో కొంత సేపు పిల్లలు శారీరకంగా అలిసిపోయేలా ఆటలు ఆడుకునే వాతావరణం సృష్టించాలంటున్నారు. అలాగే తీరిక వేళల్లో పిల్లలకు ఇష్టమైన కళారూపాల్లోనూ తర్ఫీదు ఇప్పించాలని చెబుతున్నారు. కొందరికి చిత్రలేఖనంపై ఆసక్తి ఉంటే ఇంకొందరికి సంగీతంపై ఇష్టం ఉండచ్చు. కొందరు నాట్యంలో రాణించ వచ్చు. సంగీతంలోనూ రక రకాల వాద్య పరికరాలుంటాయి. ఎవరికి ఏ వాద్య పరికరంపై ఆసక్తి ఉందో బాల్యంలోనే గమనించి అందులో వారికి శిక్షణ ఇప్పిస్తే అద్భుతమైన కళాకారులుగా ఎదిగే అవకాశాలుంటాయని శ్రీనివాసరెడ్డి సూచిస్తున్నారు. అలాగే ఆటల్లో కొందరికి క్రికెట్ అంటే పిచ్చి అయితే ఇంకొందరికి టెన్నిస్ పై ఆసక్తి ఉంటుందని ఆయన గుర్తు చేస్తున్నారు. హైదరాబాద్ సంచలనం సానియా మీర్జా తల్లి దండ్రులు బాధ్యతగా ఆమె చిన్నారిగా ఉన్నప్పుడే టెన్నిస్ నేర్పించడం వల్లనే ఆమె అంతర్జాతీయ స్థాయిలో అద్భుతాలు సాధించి హైదరాబాద్ కీర్తి పతాకను రెప రెప లాడించిందని ఆయన అంటున్నారు. అలాగే టెండూల్కర్ కు తొమ్మిదేళ్ల వయసులోనే ఆయన తల్లి దండ్రులు బ్యాట్ కొనిచ్చి ఆడుకోమని వెన్నుతట్టడం వల్లనే మాస్టర్ బ్లాస్టర్ గా ఎదిగి భారత రత్న అవార్డు అందుకునే స్థాయికి చేరుకున్నాడని ఆయన అంటున్నారు. తల్లి దండ్రులు.. గురువుల తో పాటు ప్రభుత్వాలు కూడా రేపటి తరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు నేడే ప్రపంచ స్థాయి విద్యావ్యవస్థను రూపొందించాలని.. అందుకోసం రాజీ లేకుండా నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరూ పిల్లల వికాసానికి తమ వంతు కృషిని అందించాలని ఆయన సూచిస్తున్నారు. అప్పుడే భారత దేశం ప్రపంచంలో నంబర్ వన్ గా నిలబడుతుందని ఆయన అభిప్రాయ పడుతున్నారు.

అనిల్ కుమార్ కుంట....
సందేశ్ మీడియా...
93933 44405





